
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

శుక్రవారం 2 మే 2025



పులిరాజుకు ప్రాణగండం

- పెద్దపులులకు పొంచివున్న గండం
- మూడేళ్లలో మూడు పెద్దపులులు మృతి
- నేటికీ కనిపించని తల్లి పులి ఆచూకీ
- అధిక అటవీ విస్తీర్ణంతో సన్నగిల్లిన పర్యవేక్షణ
- తాజాగా వెలుగులోకి మరో పెద్దపులి కళేబరం

ఆత్మకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): నల్లమలలో పెద్దపులుల సంఖ్య ఇప్పుడిప్పుడే పెరుగుతున్న క్రమంలో అదేస్థాయిలో పులుల మరణాలు పర్యావరణ ప్రేమికుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. గురువారం కొత్తపల్లి మండలంలోని గుమ్మడాపురం బీట్‌లో పెద్దపులి కళేబరాన్ని అధికారులు గుర్తించారు. పర్యావరణ సూచికలో అగ్రభాగాన నిలిచిన పెద్దపులుల సంఖ్యలో ప్రపంచవ్యాప్తంగా క్షీణిస్తున్నప్పటికీ భారత్‌లో మాత్రంగా కొంతమేర ఆశాజనకంగానే ఉన్నాయి. ప్రత్యేకించి నల్లమలలో కూడా పులుల ప్రత్యుత్పత్తి సజావుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో పులుల సంఖ్యను మరింత పెంచేందుకు నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఎంతగానో ప్రయత్నాలు చేస్తోంది. పెద్దపులుల మనుగడకు సంబంధించి ప్రతి అంశాన్ని సూక్ష్మంగా పరిణించి పెద్దపులుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోంది. గడిచిన మూడేళ్లలో ఒక్క ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలోనే మూడు పెద్దపులులు వివిధ కారణాలతో పాటు సహజంగా మరణించాయి. ఒక పులి ఆచూకీ లేకుండా పోయింది. అదేవిధంగా మరో పులి వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి తీవ్రంగా గాయపడగా అటవీశాఖ అధికారులు రక్షించారు. ఇలా ప్రతిఏటా ఏదో ఒక కారణంతో పెద్దపులుల మరణించడం అటవీశాఖలో కలకలం రేపుతోంది.



2022 ఆగస్టు 9వ తేదిన వెలుగోడు రేంజ్‌లోని నార్త్‌బీట్ పరిధిలో గల బుడగల వాగులో లభ్యమైన పెద్దపులి కళేబరం

మూడేళ్లలో మూడు పెద్దపులులు మృతి

- 2022 మే 11న ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్, పెద్దఅనంతాపురం సెక్షన్, వీఏపురం నార్త్‌బీట్ లోతువాగు సమీపంలో ఓ పెద్దపులి (టీ-94) అనుమానాస్పదంగా మృతిచెందినట్లు 20 రోజుల తర్వాత అటవీ అధికారులు గుర్తిం చారు. అయితే ఇది ఆవాస మార్పు కారణంగా మరో పులితో జరిగిన భీకర పోరులో సహజ సిద్ధంగా మరణించినట్లు అప్పట్లో అటవీ అధికా రులు ప్రాథమికంగా నిర్ధారించారు. పెద్దపులి నమూనాలను ల్యాబ్‌కు పంపించిన వాస్తవానికి తెలియజేస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఆ వివరాలను వెల్లడించలేదు.
- 2022 ఆగస్టు 9వ తేదీన వెలుగోడు రేంజ్‌లోని నార్త్‌బీట్ పరిధిలో ఉన్న గుండ్ల మల్లెలమ్మ బేస్‌క్యాంపు సమీపంలో వెలుగోడు జలాశయం బ్యాక్‌వాటర్ ప్రదేశంలోని బుడగల వాగులో ఓ పెద్దపులి (టీ-48) కళేబరాన్ని అటవీ అధికారులు గుర్తించారు. అయితే ఆ పులికి మెడ చుట్టూ క్లచ్‌వైర్ ఉచ్చు ఉండటంతో తీవ్ర గాయమై రక్తస్రావం, చీము పట్టి మృతిచెందింది. ఇదికూడా అనుమానాస్పద మృతిగా నమోదు చేసినప్పటికీ ఈ ఘటనకు సంబంధించిన వాస్తవాలను అటవీ అధికారులు వెల్లడించలేదు.
- తాజాగా ఆత్మకూరు రేంజ్, ముసలిమడుగు సెక్షన్, గుమ్మడాపురం బీట్ పరిధిలో గల దేవర సెల వద్ద ఏప్రిల్ 30న ఓ పెద్దపులి కళేబరాన్ని గుర్తించారు. అ యితే మృతికి గల కారణాలపై అటవీ అధి కారులు ఎలాంటి స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. పెద్దపులి శరీర అవయవాలను సేకరించి సీసీఎంబీ హైదరాబాద్‌కు పంపిస్తున్నామని, రిపోర్టు వచ్చాకే వివరాలు తెలియజేస్తామని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.

మిగతా 7వ పేజీలో



తాజాగా గుమ్మడాపురం బీట్‌లోని దేవరసెల వద్ద లభ్యమైన పెద్దపులి కళేబరం

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిల గడువు పెంపు

కర్నూలు అగ్రికల్చర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని 71 ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్)కు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని అక్టోబరు 30 వరకు (ఆరు నెలలు) పొడిగించి, మరో ఐదు పీఏసీఎస్‌లకు కొత్తగా అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. ఆరునెలల పాటు నియమిస్తూ జీవో నెం.229ని గురువారం జారీచేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వు లు జారీచేశారు. ఈఉత్తర్వుల ప్రకారం వీరు మే 1వ తేదీ నుంచి ఆరు నెలల పాటు అంటే 30.10.2025 వరకు ఈపదవిలో కొనసాగుతారని జీవోలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీకాంత రెడ్డిని పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమించారు. కల్లూరు సంఘా నికి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న నాగ రమణయ్యను నియ మిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నంద్యాల జిల్లాలో హనుమంత గుండం సంఘానికి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాచయ్యను నియమించారు. మరో పది రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని 96 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఎమ్మెల్యేల సిఫారసుతో పర్సన్ ఇన్‌చార్జిలుగా నియామకం చేపట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ప్రకృతి విపత్తులకు గురయ్యే ప్రాంతాల్లో ప్రపంచ ఆహార కార్యక్రమం కింద భారత్, శ్రీలంక ప్రభుత్వాలు ఐదేళ్ల పాటు నిర్వహించే అడాప్షన్ ఫర్ రెసిలియెన్స్ ప్రాజెక్ట్ (ఏడీఏపీటీ4ఆర్)ను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి ఏపీ రైతుసాధికార సంస్థకు అధికారం ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

4న నీట్ పరీక్ష

ఏర్పాట్లపై కర్నూలు కలెక్టర్ సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించిన నీట్ యూజీ-2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లు, లైన్ డిపార్టుమెంటు అధికారులు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 4న జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలన్నీ కర్నూలు నగరంలోనే ఉన్నాయన్నారు. పరీక్షకు మొత్తం 4,466 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత విద్యార్థులను అనుమతించరని తెలిపారు. ప్రతి 4 కేంద్రాలకు ఒక జిల్లా అధికారిని నియమించామన్నారు. ప్రతి కేంద్రానికి ఒక సీఐ లేదా ఎస్ఐ స్థాయి పోలీసు అధికారిని నియమించినట్లు తెలిపారు. అలాగే సెంటర్ అబ్జర్వర్‌ను కూడా నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బీఎన్ఎస్ సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లును, పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నగరంలో అభ్యర్థులకు ట్రాఫిక్ వల్ల ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ బాబు ప్రసాద్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, నోడల్ ఆఫీసర్ (కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్) పాయల్ ప్రియదర్శిని, డీఈవో శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



నంద్యాల సమీపంలోని కానాల వద్ద నిర్మించే 167కే జాతీయ రహదారి

అభివృద్ధి దిశగా..

- బుగ్గనపల్లి- పాణ్యం డంబ్లిక్ రైల్వే లైన్ ప్రారంభం
- వర్చువల్ పద్ధతిలో ప్రధాని చేతుల మీదుగా..
- ఇప్పటికే నంద్యాల- ఆత్మకూరు-హైదరాబాద్ రోడ్డు పనులు
- తగ్గనున్న ప్రయాణ దూరం
- జిల్లా ప్రజల్లో ఆనందోత్సాహాలు


నంద్యాల జిల్లా మీదుగా 167కే జాతీయ రహదారి మంజూరైన విషయం తెలిసిందే. ఈ రహదారి గుండా కడప, నంద్యాల జిల్లాల ప్రజలు కర్నూలుకు వెళ్లకుండా నేరుగా హైదరాబాదు వెళ్లవచ్చు. ఇందులో భాగంగా కృష్ణానదిపై ఐకానిక్ తీగల వంతెన నిర్మిస్తారు. సంగమేశ్వరం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుంది. సుమారు 60 కిలోమీటర్ల మేర ప్రయాణ దూరం తగ్గుతుంది. గంటన్నర సమయం ఆదా అవుతుంది. ఇంత ప్రాధాన్యతగల ఈ రహదారి పనులను విడతల వారీగా చేస్తున్నారు. తాజాగా ఈ రహదారి పరిధిలోని నంద్యాల- నొస్సం వరకు(కడప జిల్లా సరిహద్దు) 62 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి నుంచి వర్చువల్‌గా శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. అట్లాగే ఇటీవల పూర్తయిన గుంతకల్లు- గుంటూరు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా డోన్ నియోజకవర్గం పరిధిలోని బుగ్గనపల్లి- పాణ్యం లైన్‌ను కూడా ప్రారంభించనున్నారు.

నంద్యాల, మే1(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని నంద్యాల రూరల్ నుంచి గోస్పాడు.. కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు(కడప జిల్లా జమ్మలమడుగు సమీపం) రూ. 691.81 కోట్లతో 62 కిలోమీటర్లు (10 మీటర్ల బీటీ రోడు) రెండు వరసల జాతీయ రహదారి నిర్మించనున్నారు. నేడు ప్రధానమంత్రి దీనికి భూమి పూజ చేయనున్నారు. ఆయితే ప్రస్తుతం ఈ 62 కిలోమీటర్లు రోడ్డుకు 140 హెక్టార్ల భూమి కావాలని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 3000 మంది రైతులకు భూ పరిహారం కింద రూ.110 కోట్లు విడతల వారీగా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో అందజేస్తారు. ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తి కానుంది. ఈ రహదారి పనులకు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్‌కు టెండర్ దక్కింది. ఈ ఏడాది జూన్ నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీంతో 2027 జూన్‌కు ఈ రోడ్డు పూర్తి కానుందని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. ఏదిఏమైనా ఈ రోడ్డు పూర్తయితే సమీప ప్రాంతాల భూముల విలువ భారీగా పెరుగుతుంది.

తగ్గనున్న ప్రయాణ దూరం...

167కే జాతీయ రహదారి మొత్తంగా 170 కిలోమీటర్లు కాగా.. విడతలవారీగా టెండర్లు పిలిచి ఈ రోడ్డు పనులు చేయిస్తున్నారు. నేడు పీఎం భూమి పూజ చేసే రోడ్డు పూర్తైయితే నంద్యాల జిల్లాలోని నంద్యాల రూరల్, గోస్పాడు, కోవెలకుంట్ల, నొస్సం, కడప జిల్లాలోని జమ్మలమడుగు తదితర ప్రజలకు హైదరాబాదు వెళ్లేందుకు సుమారు 60 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. పైగా వాణిజ్య పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందే అవకాశం కూడా ఉంది. ఈ రోడ్డు పరిధిలోని కడప జిల్లా జమ్మలమడుగు- కదిరి వరకు జరిగే రోడ్డు పనుల వల్ల నంద్యాల జిల్లా ప్రజలకు బెంగళూర్ ప్రయాణం కూడా సులభం అవుతుంది. 2016లో గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ లైన్ రూ. 3887 కోట్లతో 401 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు ప్రారంభించారు. విడతల వారీగా ఈ లైన్ నిర్మాణం సుమారు 80శాతం పూర్తి చేశారు. ఆయితే ఇటీవల జిల్లాలోని డోన్ పరిధిలోని బుగ్గనపల్లి- పాణ్యం రైల్వే లైన్ పూర్తయింది. సుమారు రూ. 150 కోట్లతో 18 కిలోమీటర్లు రైల్వేలైన్ నిర్మించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ లైన్‌ను అమరావతి నుంచి నేడు ప్రధానమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు.

ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు చేసే కృష్ణా నది ప్రాంతం (ఫైల్)



గోస్పాడు మండల పరిధిలో రైతుల భూముల్లో వెళ్లే జాతీయ రహదారి ప్రాంతం



సీమ ప్రజలకు ఎంతో మేలు...



167 కే జాతీయ రహదారితో నంద్యాల, కోవెలకుంట్ల గోస్పాడు, నొస్సం ప్రజలతో పాటు కడప జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరం. ఈ రోడ్డు అనంతపురం నుంచి అమరావతి 544డికి లింక్ అవుతుంది. దీంతో విజయవాడ, బెంగుళూర్ ప్రయాణ సౌకర్యం పెరుగుతుంది. జమ్మలమడుగు- నొస్సం రోడ్డు పూర్తి కావచ్చింది. తాడిపత్రికి కూడా ప్రయాణ సౌకర్యం ఉంటుంది. మొత్తంగా కడప, అనంతపురం, నంద్యాల జిల్లా వాసులకు ఈ రోడ్డు వల్ల ఎంతో మేలు జరుగుతుంది.

\- ఎన్‌హెచ్, ఎస్ఈ హరిప్రసాద్

ఈ రోడ్డు రావడం అదృష్టం



167కే రోడ్డు నంద్యాలకు రావడం మా అదృష్టం. ఈ రోడ్డు పూర్తయితే మా మండలంతో పాటు జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరం. హైదరాబాదుకు ప్రయాణం సులభం అవుతుంది. నిరుపేద ప్రజలకు ఈ రోడ్డు పలు రకాలుగా ఉపయోగపడనుంది. ప్రధానంగా మా మండల పరిధిలోని రైతుల భూములకు విలువ పెరుగుతుంది.

\- కాటమిరెడ్డి తులసీశ్వరరెడ్డి, గోస్పాడు

మాకు ఎంతో ఆనందంగా ఉంది



ఈ రోడ్డు కోవెలకుంట్ల మీదుగా వెళ్లడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. హైదరాబాదు, కడప, బెంగళూరు వెళ్లాలంటే ప్రయాణ భారం ఎక్కువగా ఉంది. ఈ రోడ్డు త్వరగా పూర్తయితే మంచిది. వాణిజ్యపరంగా కూడా ఈ రోడ్డు దోహదపడుతుంది.

\- దూదేకుల తిరుపాలు, కోవెలకుంట్ల

అక్రమ వెంచర్లు.. అడ్డగోలు అమ్మకాలు

- పట్టణ శివారులో వెలుస్తున్న వైనం
- నిబంధనలు పాటించని అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



నంద్యాల పట్టణ శివారుల్లో వెలసిన అక్రమ లే అవుట్లు

నంద్యాల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారుల్లో, నంద్యాల మండల పరిధిలో అనధికార లే అవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, వ్యవసాయ భూములను తక్కువ ధరకు కొని నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా మారుస్తున్నారు. వాటిని విక్రయించి రూ.కోట్లల్లో ఆర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇన్ని జరుగుతున్నా పురపాలక అధికారులు, పంచాయతీ అధికారులుగానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

నిబంధనలకు తూట్లు...

కొత్త లేఅవుట్లు ఏర్పాటు చేయాలంటే డీటీసీపీ అనుమతి ఉండాలి. పుర పాలక సంఘం గానీ, పంచాయతీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. తాజా నిబంధనల ప్రకారం డీటీసీపీ అనుమతి రావాలంటే అంతర్గత రహదారులకు 40 అడుగులు, ప్రధాన రహదారులకు 60 అడుగులు రోడ్లు ఇతర కనీస అవసరాలకు కొంత స్థలాన్ని రిజర్వు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలంటే మార్కెట్ ధర ప్రకారం చలానా తీసి తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆర్డీవో నుంచి అనుమతులు వస్తాయి. అనంతరం వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మార్చుకున్న వ్యక్తి లేఅవుట్ ఫీజు, భూ వినియోగమార్పిడి డెవలెప్‌మెంట్ చార్జీలు, ప్రాసెసింగ్ ఫీజు, ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. సామాజిక అవసరాలకు 10 శాతం ఖాళీ స్థలం వదిలి రహదారులు ఏర్పాటు చేయాలి. ఇవేమీ పట్టించకోకుండా స్థిరాస్తి వ్యాపారులు, వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మి అక్రమంగా ఆర్జిస్తున్నా.. పురపాలక, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం

పురపాలక సంఘం పరిధిలో ఎక్కడైనా అక్రమ లే అవుట్లు ఉంటే వారందరికీ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపి తొలగిస్తున్నాం. కచ్చితంగా అనుమతులు తీసుకోవాలి.

\- వెంకటదాస్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్, నంద్యాల

పట్టణ శివారుల్లో..

ప్రధానంగా నంద్యాల పట్టణ శివారుల్లో రైతునగరం, క్రాంతినగర్, చాపిరేవుల, నంద్యాల చెరువు కట్ట వద్ద, నంద్యాల మండల పరిధిలో అయ్యలూరు, కొత్తపల్లె, మహానంది దారిలో.., వెంకటేశ్వరాపురం, ఆళ్లగడ్డ హైవే అనుకుని వంటి తదితర ప్రాంతాల్లో అక్రమ లే అవుట్లు రోడ్డుకు ఇరువైపులా వెలుస్తున్నాయి. స్థానికులు కొంత మంది ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు: ఎమ్మెల్యే



ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

జూపాడుబంగ్లా, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండలంలోని 80 బన్నూరు గ్రామంలో గురువారం 40వేల లీటర్ల సామర్థ్యంతో రూ.43 లక్షలు జలజీవన్ మిషన్ కింద మంజూరైన తాగునీటి ట్యాంకు నిర్మాణానికి ముఖ్యఅతిథిగా పాల్గొని భూమిపూజ చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, కేసీ కాలువ నీటి సంఘం చైర్మన్ పరమేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, రవికాంత్, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, సుధాకర్, రవికుమార్‌యాదవ్, ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ నాగేంద్ర, పీఆర్‌ఏఈ బషీర్, ఏపీవో రేష్మా, ఏవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బండిఆత్మకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దస్తగిరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని తెలిపారు. సమావేశానికి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలి



ఆత్మకూరులో వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

ఆత్మకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ తరుపున ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో ఏవీ సుబ్రమణ్యం సూచించారు. గురువారం వేసవి క్రీడా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా శిబిరాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలాజీనాయక్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, క్రీడా శిక్షకులు జునైద్‌బాషా, మహెబూబ్, హరియాదవ్, సతీష్, ఖాజాహుస్సేన్, ఉపేంద్ర, నరేష్ ఉన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మద్దమ్మ విద్యార్థులకు సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యార్థులకు గ్రంథాలయంలో వివిధ అంశా లపై గత నాలుగు రోజులుగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు ఆటలు, పాటలు, నీతి కథలు, ఇంగ్లీష్ తదితర అంశాలలో బోధిస్తున్నట్లు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఆత్మకూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకాలువ గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గణపతి, సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ, శ్రీదేవి భూదేవి సహిత చెన్న కేశవ స్వామి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కోసం మొదటిరోజైన గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో గోపూజ, గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, కంకణ ధారణం, పుణ్యాహ వచనం, గణపతి హోమంను భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే శుక్రవారం మహాస్నపనం, 108 కలశాలతో అభిషేకం, ప్రధాన హోమాల అనంతరం సాయంత్రం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం దీక్షాహోమం అనంతరం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష, ధ్వజ స్థంభ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 3వ తేది విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



దుస్తులతో క్రీడాకారులు

నంద్యాల హాస్పిటల్, మే 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా బీచ్ కబడ్డీ జట్టుకు నంద్యాల పట్టణంలోని గురురాజ విద్యాసంస్థల చైర్మన్, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా చైర్మన్ దస్తగిరిరెడ్డి క్రీడాదుస్తులు అందజేశారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి సీనియర్ బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చూపాలని దస్తగిరిరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దండెనాగరాజు, కబడ్డీ కోచ్‌లు కిశోర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే

మే డే వేడుకలను గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. హక్కుల కోసం కార్మికులు పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మే ఆవశ్యకత గురించి నాయకులు వివరించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



ఆత్మకూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో..



ఆత్మకూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..



నందికొట్కూరులో సీపీఎం ఆధ్వర్యంలో..



నంద్యాల టౌన్: నంద్యాలలో..



నంద్యాల రూరల్: నంద్యాలలో..



గడివేములలో..



నందికొట్కూరులో సీపీఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో..



బండిఆత్మకూరులో వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్మికులు



పగిడ్యాల: నెహ్రూనగర్ గ్రామంలో..



మహానంది: బుక్కాపురంలో..



జూపాడుబంగ్లాలో..



వెలుగోడులో..

'నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి'



శిక్షణలో బాలికలు

నంద్యాల కల్చరల్, మే 1(ఆంధ్రజ్యోతి): బాలికలు నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలని రాష్ట్ర సేవికా సమితి సభ్యురాలు రాధిక సూచించారు. నంద్యాలలోని శ్రీగురురాజ పాఠశాలలో వారం రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రసేవికా సమితి ఆధ్వర్యంలో పట్టణ గ్రామీణ బాలికలకు ప్రాథమిక శిక్షావర్గ ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో కత్తి, కర్రసాము, కరాటే, యోగా, ధ్యానం, తదితర వాటిపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవికా సమితి సభ్యులు, వివిధ గ్రామాల నుంచి బాలికలు పాల్గొన్నారు.

అమరావతికి తరలిన ప్రజలు



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

ఆత్మకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఆత్మకూరు నుంచి గురువారం రాత్రి ప్రజలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారి వాహనానికి తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో సుబ్రమణ్యం, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, వీఆర్‌ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి వారి వాహనానికి జెండా ఊపి పంపించారు. అనంతరం రాజధానీ నిర్మాణం కోసం సీఎం చంద్రబాబు అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా ప్రధానీ నరేంద్రమోదీ చేతుల మీదుగా అమరావతి పునర్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆంధ్రుల కలల రాజధానీగా అమరావతి నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'

వెలుగోడు, మే 1 (ఆంధ్రజ్యోతి): అధీకృత డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే పిడి యాక్టులు నమోదు చేస్తామని ఏడీఏ ఆంజనేయ హెచ్చరించారు. గురువారం వెలుగోడు పట్టణంలోని రైతుసేవా కేంద్రంలో మండల అధీకృత డీలర్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వం అనుమతించిన, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు మాత్రమే విక్రయించాలని అన్నారు. ప్రతి రైతుకు బిల్లులను ఇవ్వాలని, స్టాక్ రిజిష్టర్లు సక్రమంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్, డీలర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నంద్యాల హాస్పిటల్, మే 1, (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఉద్యోగభద్రత కల్పించి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని సీహెచ్‌వోల జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం 3వ రోజు ధర్నాలో సీహెచ్‌ఓలు పాల్గొన్నారు. ఉపాధ్యక్షుడు భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, సెక్రటరీ అఖిల్, భార్గవ్, జిల్లా కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

మహానందిలో వడగండ్ల వాన

● గాజులపల్లిలో కూలిన భారీ వృక్షం



గాజులపల్లిలో ఇంటిపై పడిన భారీ వృక్షం

మహానంది, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. అరగంట పాటు ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో వడగండ్ల వర్షం కురిసింది. దీంతో మండలంలో రైతులు అధికంగా సాగు చేసే అరటి చెట్లు నేలకూలాయి. అలాగే గాజులపల్లి లోని కొత్తకొట్టాలలో సుధాకర్ ఇంటిపై భారీ వృక్షం ఇంటిపై పడింది. డ్రైనేజీ కాల్వలోని మురికినీరు ఇళ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.కొంతసేపు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరురూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం గ్రామ శివార్లలో సారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ గురువారం తెలిపారు. గ్రామశివార్లలోని అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా ఆ గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 600 లీటర్ల బెల్లపు ఊటను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు ఈ మేరకు రాంప్రసాద్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

బండిఆత్మకూ మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్నపాడు గ్రామంలో రెండు సిమెంటు దారులు కలిసే కూడలి వద్ద గుంత ఏర్పడింది. ఈ దారిలో ద్విచక్ర వాహనాలపై, కాలి నడకన వెళ్తూ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఏ మాత్రం ఆదమరిస్తే ప్రమాదానికి గురికావాల్సిందే. రాత్రి వేళ కొందరు ఈ గుంతలో పడి గాయాలపాలైనట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఎన్నో రోజులుగా సాథనిక అధికారులకు ఈ గుంత కనిపిస్తున్నా తమకేమీపట్టదన్నట్లు గాలికి వదిలేశారని, ఇప్పటికైనా గుంత పూడ్చి ప్రమాదాలు జరుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



ఈర్నపాడులో రెండు రోడ్ల కూడలిలో ప్రమాదకరంగా గుంత

చికిత్స పొందుతూ ఏఆర్ కానిస్టేబుల్ మృతి



చిన్నికృష్ణ (ఫైల్)

నంద్యాల టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల హెడ్ క్వార్టర్స్‌లో పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ చిన్నికృష్ణ (35) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలివీ.. ఏప్రిల్ 25న కుటుంబ కలహాలతో పట్టణ శివారులో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. గత రెండు రోజుల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. చిన్ని కృష్ణ 2013 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ సొంతూరు అవుకు. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి



మెహరున్నీసా

వెలుగోడు, మే 1 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలోని సీపీ నగర్‌లో గురువారం పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. కాలనీకి చెందిన మెహరున్నిసా ఇంట్లో ఉండగా ఇంట్లోకి ఆకస్మాత్తుగా ప్రవేశించిన పాము మెహరున్నీసాను (55) కాటేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మెహరున్నీసాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

ఆత్మకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని ఆత్మకూరు అర్బన్ సీఐ రాము సూచించారు. గురువారం రాత్రి ఆత్మకూరు మండలంలోని సిద్దేపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలందరు ఐక్యతగా కలిసి మెలిసి ఉండాలని అన్నారు. ప్రత్యేకించి ఎలాంటి గొడవలకు, కక్షలకు తావు లేకుండా ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే ఉండదని తేల్చిచెప్పారు. అనంతరం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వెలుగోడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల విష్ణు ఆసుపత్రి వైద్యులు వికాస్, క్రిష్ణ సాహితీ సూచించారు. గురువారం వెలుగోడులో రోఖియాబీ దర్గా ఉరుసును పురస్కరించుకొని ఎమ్మెల్యే బుడ్డా ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ నాయులు జాకీరుహుస్సేన్, మోమిన్ రసూల్, ఖలీల్, సయ్యద్ ప్రారంభించారు. అనంతరం రోగులను పరీక్షించి వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజరు కరీం, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

వెలుగోడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గృహ నిర్మాణ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి నాగ మునేశ్వరి సూచించారు. గురువారం వెలుగోడులో హౌసింగ్ లే అవుట్లను ఆమె సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పులిరాజుకు ప్రాణగండం



2023 మార్చి 6న లభ్యమైన పులికూనలు ఇవే (ఫైల్)

5వ పేజీ తరువాయి

ఆత్మకూరు రేంజ్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్ సందుబాటు రస్తాలో ఓ పెద్దపులి బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు నడుముకు చిక్కుకుని తీవ్రంగా గాయపడిన విషయాన్ని 2024 ఫిబ్రవరి 25వ తేదీన అటవీ అధికారులు కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించారు. ఆ తర్వాత మార్చి 5న రెస్క్యూ ఆపరేషన్ ద్వారా పులిని బంధించి బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రంలో వారం రోజుల పాటు సపర్యలు చేసి తిరిగి అడవిలో వదిలేశారు. దీన్ని అధికారులు గుర్తించకపోయింటే ఆ పులి కూడా మరణించే అవకాశం ఉండేది.

నేటికీ కనిపించని తల్లి పులి ఆచూకీ

2023 మార్చి ఆరో తేదీన నల్లమల అడవి నుంచి నాలుగు ఆడ పులికూనలు దారితప్పి ఊళ్లోకి చేరాయి. గ్రామస్థులు ఆ పులికూనలను గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు తల్లిపులి (టీ-108) ఆచూకీ కోసం అటవీ అధికారులు నాలుగు రోజుల పాటు అనేక విధాలుగా అన్వేషించినప్పటికీ ఆచూకీ లభించలేదు. చివరకు మార్చి 10వ తేదీన ఆ పులికూనలను తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు తరలించారు. ఈ ఘటనలో అప్పట్లోనే దేశంలోనే సంచలనం రేకెత్తించింది. అప్పట్లో తల్లి పులి క్షేమంగానే ఉందని అటవీ అధికారులు చెప్పే ప్రయత్నాలు చేసినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ సంఘటనకు సంబంధించి కూడా అటవీ అధికారులు స్పష్టత ఇవ్వలేకపోయారు. కాగా ప్రస్తుతం ఆ పులి కూనలు తిరుపతి జూలో ఉన్నప్పటికీ నాలుగు పులికూనల్లో రెండు కూనలు అనారోగ్యంతో మృతి చెందాయి.

పర్యవేక్షణ కొరవడిందా?

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82చ.కి.మీల పరిధిలో విస్తరించిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తింపు దక్కించుకుంది. అందులో 1228.11చ.కి.మీల అటవీ విస్తీర్ణం ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో ఉంది. అయితే బ్రిటీష్ కాలం నుంచి అటవీ శాఖ పరిధిలోని డివిజన్లు, రేంజ్‌లు, సెక్షన్లు, బీట్‌లు విస్తీర్ణం విస్తారంగా ఉండటం వల్ల అటవీ సంరక్షణ సన్నగిల్లుతోందన్న విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి ప్రస్తుతం నల్లమలలో ఒక్కో ఫారెస్ట్ బీటు 3వేల హెక్టార్ల నుంచి 10వేల హెక్టార్ల వరకు విస్తీర్ణం ఉన్నాయి. టైగర్ జోన్ కావడం వల్ల ఒక్కో బీటు 1500 హెక్టార్ల చొప్పున విభజిస్తే అడవులు, వన్యప్రాణుల సంరక్షణ సజావుగా ఉంటుందని అటవీ శాఖకు చెందిన సీనియర్ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ అంశాన్ని ఎన్నో దశాబ్దాలుగా అటవీశాఖ దృష్టికి తీసుకెళ్తున్నా ఫలితం లేదని అంటున్నారు. అదేక్రమంలో అటవీ శాఖగా సమృద్ధిగా ఉద్యోగుల నియామకం చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. అరకొర నియామకాల వల్ల అటవీ, వన్యప్రాణి సంరక్షణ సజావుగా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనివల్లనే నల్లమలలో పులులు మరణిస్తున్నా గుర్తించడం ఆలస్యమవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి నల్లమలలో పెద్దపులుల మరణాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెద్దపులుల సంరక్షణకు కృషి



ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో పెద్దపులుల సంరక్షణకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం. అటవీ ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం గస్తీ చర్యలు చేపడుతున్నారు. అడవుల్లో ప్రతిరోజు ట్రాకర్స్ పర్యటించి వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి సారిస్తున్నాయి. అయితే మారుమూల ప్రదేశాల్లో పులి మరణించి ఉండటం వల్ల గుర్తించడం ఆలస్యమైంది. పులి మృతికి గల కారణాలను ల్యాబ్ రిపోర్టులు రాగానే వెల్లడిస్తాం. పులుల మరణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం.

- వి.సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

8,9 తేదీల్లో కర్నూలు మీదుగా తిరుపతికి రెండు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ నేపథ్యంలో చర్లపల్లి-తిరుపతి మధ్య కర్నూలు మీదుగా ఈ నెల 8,9 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. 8న చర్లపల్లి నుంచి తిరుపతికి రాత్రి 9:35 గంటలకు 07259 ప్రత్యేకరైలు, ఈ నెల 9న తిరుపతి నుంచి చర్లపల్లికి 07260 ప్రత్యేకరైలు నడపనున్నట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. మధ్యలో మల్కాజిగిరి, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, కర్నూలు, డోన్, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప,రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు.

హైవే పనులను పూర్తి చేయండి

కలెక్టర్ రంజిత్ బాషా



నేషనల్ హైవే విస్తరణ పనులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 340-సీలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ 340-సీ నేషనల్ హైవే విస్తరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ 340-సీకి సంబంధించి ఎల్లమ్మ దేవాలయం, మిలటరీ కాలనీ, గార్గేయపురం చెరువు వద్ద పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. భూసేకరణ పూర్తి చేసి నెల రోజులైనా ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ఎన్‌హెచ్ అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్లను పిలిపించి వారితో మాట్లాడి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ పీడీ పద్మజ, ఆర్అండ్‌బీ ఈఈ శంకర్‌రెడ్డి, ఆర్డీఓ సందీప్ కుమార్, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

కర్నూలు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంప్ సెంటర్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి సోమశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం కంపెనీ ఆధ్వర్యంలో ఎంపీసీ, ఎంఈసీ, మ్యాథ్స్ సబ్జెక్టు ఉన్న ఒకేషనల్ కోర్సుల్లో 75 శాతం, మ్యాథ్స్ సబ్జెక్టులో 60 శాతం మార్కులతో పాసైన 2024, 2025 బ్యాచ్ విద్యార్థులు ఇంటర్వ్యూకు కావాలన్నారు. 17 ఏళ్లు పైబడి, ఆసక్తి గల అభ్యర్థులు ముందుగానే ఆన్‌లైన్‌లో గానీ, కార్యాలయానికి చేరుకొని గానీ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

తీర్పునిచ్చిన కర్నూలు జిల్లా న్యాయాధికారి జి. కబర్ది

కర్నూలు లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో పాత కక్షలు మనసులో ఉంచుకుని చేసిన హత్యపై నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులైన నగేష్, నాయకంటి బాలమద్దికి జీవిత ఖైదు విధిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ సెషన్స్ న్యాయాధికారి జి.కబర్ది గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. డోన్ మండలం ఎస్.గుండాల గ్రామానికి చెందిన హతుడు బోయ గుమిడిరాళ్ల కౌలుట్ల గ్రామపెద్దగా పనిచేసి గ్రామంలో పేరు గడించారు. 2016లో మే 15న హతుడు తన స్వగ్రామం నుంచి డోన్‌కు పనిమీద వచ్చాడు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ కాలువలో కౌలుట్ల మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. హతుడి కుమారుడు కాంతారావుకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో హతుడి కుమారుడు, కుటుంబ సభ్యులు డోన్ వెళ్లి హతుడిని గుర్తించి డోన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేశారు. ఆ తర్వాత డోన్ మండలం కొత్రాయి గ్రామానికి చెందిన మాదిగ నగేష్, గుమ్మకొండ గ్రామానికి చెందిన నాయకంటి బాలమద్దిలపై కేసును విచారించి వీరే కౌలుట్లను హత్యచేశారని నిర్ధారించారు. గ్రామంలో కౌలుట్ల ఎదుగుదలను ఓర్చుకోలేక నిందితులు ఈ హత్యకు పాల్పడినట్లు డోన్ పోలీసులు తమ విచారణలో కనుగొని కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.వెంకటరెడ్డి వాదించారు.



యావజ్జీవ శిక్ష పడిన ఇద్దరు నిందితులు

పోలీసులను అభినందించిన నంద్యాల ఎస్పీ

కౌలుట్ల హత్య కేసులో పోలీసులు దర్యాప్తులోనూ, సాక్ష్యాలు సేకరించడంలోనూ, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులపై శిక్షపడేలా కృషిచేసిన పోలీసు అధికారులను నంద్యాల ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా అభినందించారు. పోలీసులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కృషి చేసినందుకు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, విచారణాధికారి, జిల్లా కోర్టు పీపీ ఎం.వెంకటరెడ్డిని అభినందించారు.

హత్య కేసులో ఎనిమిది మంది అరెస్టు

డీఎస్పీ బాబుప్రసాద్

కర్నూలు క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెల 27వ తేదీ పులకుర్తి గ్రామంలో జరిగిన నడిపి రంగడు హత్యకేసులో ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ బాబుప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పులకుర్తి గ్రామానికి చెందిన హతుడు రంగడు మేనల్లుడైన సురేష్‌కు బోయ మునిస్వామికి మధ్య ఓ యువతి విషయంలో తరుచూ గొడవలు జరిగాయి. దీంతో పాటు ఇదే గ్రామానికి చెందిన బోయ దస్తగిరి, బోయ నరసింహులుకు మధ్య తిరునాళ్లలో ఘర్షణ జరిగింది. ఈవిషయంలో నడిపి రంగడు, సురేష్ ఇద్దరూ నరసింహులుకు మద్దతు ఇవ్వగా.. మునిస్వామి దస్తగిరికి సపోర్టు చేశాడు. దీంతో సురేష్, మునిస్వామిల మధ్య వైరం మరింత పెరిగింది. మునిస్వామిపై దొంగ అని, చాలా కేసులు ఉన్నాయని సురేష్ అవమానించాడు. దీంతో మునిస్వామి సురేష్‌పై కక్ష పెంచుకొని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. గతనెల 26వ తేదీ రాత్రి మునిస్వామి, అతని స్నేహితులు మహేష్ మద్యం సేవించి సురేష్ వద్దకు వెళ్లారు. సురేష్ కనిపించకపోవడంతో అతడి ట్రాక్టర్ డ్రైవర్ సోమేష్‌ను కొట్టారు. 27వ తేదీ ఉదయం సోమేష్ ఈ విషయాన్ని రంగడు, సురేష్‌లకు చెప్పాడు. దీంతో మరోసారి వారి మధ్య తగాదా జరిగింది. ఈ ఘర్షణలో నడిపి రంగడు, సురేష్‌లపై కట్టెలతో, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘర్షణలో రంగడు తీవ్రంగా గాయపడి 28వ తేదీన మృతి చెందాడు. కేసు నమోదు చేసిన కోడుమూరు సీఐ చిరంజీవి, ఎస్ఐ స్వామి, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య నిందితులు మునిస్వామి, బోయ శివ, బోయ బజారి, బోయ రాకేష్, బోయ సురేష్, కల్లపరి నాయుడు, బోయ నాగరాజు, బంగి తిమ్మప్పను అరెస్టు చేశారు. అనంతరం కర్నూలు డీఎస్పీ ఎదుట హాజరుపరిచారు. పోలీసులు నిందితుల నుంచి రాడ్లు, మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

ఈత కొలనులో బాలుడి మృతి

● రెప్పపాటులో విషాదం ● కుప్పకూలిన కుటుంబం

ఆదోని రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : అమ్మా స్విమింగ్ పూల్‌కు వెళ్దాం.. నేను ఈత నేర్చుకుంటా.. బడి కూడా లేదు కదమ్మా.. నాన్నకు చెప్పమ్మా.. అని ఆ బాలుడు మారాం చేశాడు. ఆ తల్లిదండ్రులు ముగ్గురు కుమారులతో కలిసి ఇస్వీ రహదారిలో ఉన్న స్విమింగ్ పూల్‌కు వెళ్లారు. అక్కడ అనుకోకుండా జరిగిన ప్రమాదాల్లో బాలుడు క్షణాల్లో నీటి కొలనులో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. ఆదోని పట్టణం ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న రవి, రీటా దంపతులకు ముగ్గురు మగ పిల్లలు. రవి కోసిగిలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం పెద్ద కొడుకు ప్రిన్స్(5) స్విమ్మింగ్ పూల్‌కు వెళ్దామని మారాం చేశాడు. దీంతో ఆ దంపతులు ముగ్గురు చిన్నారులను తీసుకొని ఇస్వీ రహదారిలో ఉన్న ఈడెన్ గార్డెన్ స్విమింగ్ పూల్‌కు వెళ్లారు. అక్కడ ముందుగా కుటుంబ సభ్యులు ఫొటోలు తీసుకున్నారు. తరువాత ఇద్దరు చిన్నారులను పట్టుకొని తల్లి ఒకవైపు ఉండగా, పెద్ద కొడుకు ప్రిన్స్‌తో కలిసి తండ్రి స్విమింగ్ పూల్ వద్దకు వెళ్లాడు. క్షణాల్లో పక్కన ఉన్న ప్రిన్స్ స్విమింగ్ పూల్ నీటిలో తేలాడుతూ కనిపించాడు. అక్కడున్న వారంతా కేకలు వేయడంతో పరుగున వెళ్లి తండ్రి నీటిలో నుంచి కొడుకును బయటికి తీశాడు. అప్పటికే ఆ బాలుడు మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటి వరకు తమ బిడ్డ ఆనందంగా గడిపిన క్షణాలను గుర్తు చేసుకొని తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందు స్విమింగ్ పూల్‌లో ఫొటో దిగిన బాలుడు

స్విమింగ్ పూల్‌కు అనుమతి ఉందా?

బాలుడి మరణానికి కారణమైన స్విమింగ్ పూల్‌కు అనుమతులు ఉన్నాయా? ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారా? ట్రైనర్ ఉన్నారా లేదా? అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్విమింగ్ పూల్ యజమానులపై చర్యలు తీసుకోవాలి.

- కునిగిరి నీలకంఠ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కార్మికులకు మంత్రి మే డే శుభాకాంక్షలు



బనగానపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబునాయుడు ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించడం సంతోషకరమైన విషయమన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్న కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఏపీ భవిష్యత్ రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెరగడానికి, వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు ప్రసరించాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని కార్మికుల ఐక్యంగా ఉండి రాష్ట్ర పురోభివృద్ధిలో పాలు పంచుకోవాలని మంత్రి కోరారు.

రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్లు కేటాయించినట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. నాబార్డు కింద గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్లతో 192 అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నాబార్డు నిధుల కింద 1246 కిలోమీటర్ల ప్రధాన రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే 5 ఏళ్లలో రాష్ట్రంలోని రోడ్లకు పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు.

రేపు హెల్త్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్

45 మందితో సీనియారిటీ జాబితా విడుదల

కర్నూలు హాస్పిటల్, మే 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు (మేల్) పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఈ నెల 3వ తేదీ జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రాంలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్ (మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకునేలా వారిని సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా కర్నూలు జిల్లాకు చెందిన 45 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్) సీనియారిటీ జాబితాను విడుదల చేశామన్నారు. ఇదిలా ఉండగా కౌన్సెలింగ్‌కు డీఎంహెచ్ఓ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా జిల్లా మలేరియా అధికారి నూకరాజు, సభ్యులుగా ఏఓ అరుణ ఉంటారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే హెల్త్ అసిస్టెంట్లు పీహెచ్‌సీ వైద్యాధికారుల అనుమతి తీసుకుని రావాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు.

తండ్రి మందలించడంతో యువకుడి ఆత్మహత్య

ఆదోని రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): బాగా చదువుకోవాలని తండ్రి మందలించడంతో ఉరుకుంద(20) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదోని మండలం బల్లేకల్లు గ్రామానికి చెందిన యువకుడు ఉరుకుంద అటు చదువుకు దూరమై, ఇటు పనులకు వెళ్లకుండా ఉండడంతో తండ్రి తిక్కయ్య గురువారం మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షర్మిల గృహ నిర్బంధం సరికాదు

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్


కల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించిన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను గృహ నిర్బంధం చేయడం ఏమాత్రం సరికాదని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ పేర్కొన్నారు. వైఎస్ షర్మిలపై కోడిగుడ్లు, గాజుపెంకులతో దాడిచేసేందుకు యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల చెక్‌పోస్టులోని దామోదరం సంజీవయ్య భవన్ ఆయన విలేకరులతో మాట్లాడారు. 2015 ఉద్దండరాయుని పాలెంలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతంలో మళ్లీ మే 2న భూమిపూజ చేయడమంటే కేంద్ర ప్రభుత్వ మోసపూరిత ధోరణి తేటతెల్లం అయినట్లేనని ఆరోపించారు. బీజేపీ, టీడీపీ, జనసేన స్వలాభం కోసమే రాష్ట్రంలో స్వేచ్ఛాభావాలకు విఘాతం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో ఎన్డీయే ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. చిత్తశుద్ధి ఉంటే గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.24,500 కోట్లు వచ్చి ఉంటే వెనకబడిన జిల్లాలో సాగు, తాగునీటికి సంబంధించిన ప్రాజెక్టులు పూర్తి అయ్యేవన్నారు. బీజేపీ ప్రభుత్వం వల్లే రాష్ట్రానికి నిధులు రాకుండాపోయాయన్నారు.



మాట్లాడుతున్న నంద్యాల కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహాయాదవ్

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మాజీ సీఎం

మంత్రాలయం, మే 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప, కుమారుడు శివమొగ్గ ఎంపీ రాఘవేంద్ర కుటుంబ సమేతంగా గురువారం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి మంత్రాలయంకు వచ్చి పద్మనాభతీర్థ గెస్ట్ హౌస్‌లో బసచేశారు. మహా ముఖద్వారం వద్ద వీరికి మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు సురేష్ కోనాపూర్, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. తన మనవడి వివాహానికి రావాలని పీఠాధిపతిని ఆహ్వానించారు. సూపరింటెండెంట్ అనంతపురాణిక్, విజయేంద్రాచార్, వ్యాసరాజాచార్, రాఘవేంద్రపురాణిక్, నరసింహదేశాయ్, ద్వారపాలక అనంతస్వామి, తంబిస్వామి, వాజేంద్రాచార్, రాఘవేంద్రాచార్, పవన్‌ఆచార్, రంగస్వామి, వరదేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.



యడ్యూరప్పకు జ్ఞాపికను ఇస్తున్న పీఠాధిపతి

వామ్మో... ఎండలు..!



నంద్యాల ఎడ్యుకేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గురువారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు నగరంలో అత్యధికంగా 42.15 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ అధికారులు వెల్లడించారు. ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదైన ప్రాంతాలు ఇలా...

కర్నూలు జిల్లా:

మండలం	డిగ్రీల సెల్సియస్
కర్నూలు	42.15
కౌతాళం	41.0
దేవనకొండ	40.91
కోడుమూరు	40.7,
హోళగుంద	40.5
పెద్దకడబూరు	40.29
కోసిగి	40.09
ఆలూరు	40.0
మంత్రాలయం	39.94
ఎమ్మిగనూరు	39.79
వెల్దుర్తి	39.73
ఆదోని	39.72
కోడుమూరు	39.7
సి.బెళగల్	39.5

నంద్యాల జిల్లా:

మండలం	డిగ్రీల సెల్సియస్
పాములపాడు	41.64
అవుకు	41.47
గోస్పాడు	41.47
రుద్రవరం	41.41
బండిఆత్మకూరు	41.4
దొర్నిపాడు	41.29
మహానంది	41.19
పాణ్యం	40.79
ఆళ్లగడ్డ	40.57
సంజామల	40.0
కోవెలకుంట్ల	40.21
సంజామల	40.0
గడివేముల	39.79
చాగలమర్రి	39.68
డోన్	39.64
శిరివెళ్ల	39.53
నందికొట్కూరు	39.47
నంద్యాల	39.32

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు

చాగలమర్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందించనున్నట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 38 మంది రైతులు సబ్సిడీ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పిల్లర్లు, రోటావేటర్, వివిధ వ్యవసాయ పనిముట్లు, 16 స్ప్రేయర్లు, 3 చిన్న స్ప్రేయర్లు మంజూరయ్యాయని తెలిపారు. రైతు వాటా చెల్లించిన వారికి పనిముట్లు పంపిణీ చేస్తామన్నారు. జొన్నలు విక్రయించే రైతులు రైతు సేవాకేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బందేషావలి గంధోత్సవం

చాగలమర్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దమకానం వీధిలో వెలసిన బందేషావలి దర్గా వద్ద గురువారం గంధోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మౌలాన ఆధ్వర్యంలో పకీర్ల వాయిద్యాలతో వీధుల గుండా ఊరేగింపుతో గంధాన్ని దర్గా వద్దకు తీసుకెళ్లి బందేషావలి స్వామికి సమర్పించారు. పిల్లలు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. భక్తులకు దర్గా వద్ద అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

బేతంచెర్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎలక్ట్రీషియన్, పిట్టర్, మెకానిక్, వెల్డర్ ట్రేడర్లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 24 సాయంత్రం 5 గం టలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 26వ తేదీ సాయంత్రం 5గంటల లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులకు డోన్ ప్రభుత్వ ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

డోన్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో సీఐటీ యూ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుంద రయ్య జయంతి సందర్భంగా ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, సీఐటీయు నాయకులు ఏవీ భాస్కర్ రెడ్డి, మద్దయ్య, కేశాలు తదిత రులు పాల్గొన్నారు.

వైభవంగా క్షీరాభిషేకం

చాగలమర్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినాథ మందిరంలో సాయిబాబాకు వేదపండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, సాయివ్రతం చేశారు. మహిళలు ప్రత్యేక హారతులు ఇచ్చారు. సాయిబాబా పాదుకలు, చిత్రపటాలతో పల్లకోత్సవం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ప్రారంభానికి కృషి చేయాలి

డోన్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయంలో 2025- 26 విద్యా సంవ త్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సందు వెంకటరమణ, మండలాధ్యక్షుడు, న్యాయవాది బొంకూరి రవికుమార్ కోరారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025-26లో కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభించేందుకు కృషిచేయాలని విజ్ఞప్తిచేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, డోన్‌లో ప్రారంభం కాలేదని, వెంటనే డోన్‌లో అడ్మిసన్లు ప్రారంభించాలని కోరారు.

7 నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

రుద్రవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక భాస్కరనందీశ్వర ఆలయంలో కొలువుదీరిన బ్రహ్మంగారి ఆలయంలో ఈనెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురువారం నిర్వాహకులు బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలివచ్చి ఆరాధనోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

డిజిటల్ తరగతులను వినియోగించుకోవాలి

బనగానపల్లె, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాలలో వేసవి డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామని, వీటిని విద్యార్థులు వినియోగించుకోవాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్ కోరారు. గురువారం పట్టణంలోని కస్బా పాఠశాలలో గణిత నిపుణుడు సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు ప్రతిరోజు గణితం, ఇంగ్లీషు, తెలుగుపై, నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నట్లు సత్యప్రకాశ్ తెలిపారు.

సర్వేలను వేగవంతం చేయాలి

రుద్రవరం, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం అమలు చేసిన సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి సూచించారు. గురు వారం మండలంలోని చిన్నకంబలూరు సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. సర్వేలోభాగంగా మనమిత్ర, వర్క్‌ఫ్రం హోం, హౌస్‌హోల్డ్‌జియో ట్యాగింగ్ ఆధార్ లేని చిన్నపిల్లల సర్వేలను వేగవంతం చేయాలన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

కొలిమిగుండ్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె నియోజకవర్గంలో కార్యకర్తల సంక్షేమమే బీసీ కుటుంబ ప్రధాన ధ్యేయమని మంత్రి బీసీ జనార్దనరెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామంలో బీసీ ఇందిరమ్మ పర్యటించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా సాయి పల్లకోత్సవం

కొలిమిగుండ్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు వీడీ రాజగోపాల్, రామకృష్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరం: మండలంలోని చందలూరు గ్రామంలో సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చిత్రపటానికి పూలమాలలతో అలంకరించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

చాగలమర్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి రామచంద్రుడు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను వినియోగించుకోవాలన్నారు. వేసవి శిక్షణా తరగతులను జూన్ 6 వరకు నిర్వహిస్తామన్నారు.

గ్రంథాలయం విజ్ఞాన గని లాంటిది

బేతంచెర్ల: గ్రంథాలయం విజ్ఞాన గని లాంటిదని గ్రంథాలయాధికారి మధుశేఖర్ అన్నారు. జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బేతంచెర్ల శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఉపాధ్యాయురాలు కృష్ణ ప్రియ, డ్రాయింగ్ మాస్టర్ జాకీర్ హుశేన్, 31 మంది విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. మజ్జిగ పంపిణీ చేశారు.

సబ్ కోర్టును ఏర్పాటుచేయాలని వినతి

బనగానపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె కోవెలకుంట్ల కోర్టు పరిధిలో సబ్‌కోర్టు మంజూరు చేయాలని బనగానపల్లె బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కర్నూలులో జిల్లా న్యాయాధికారి కబర్దికి గురువారం వినతిపత్రం సమర్పించారు. బనగానపల్లె, కోవెలకుంట్ల కోర్టుల్లోని సమస్యలను జిల్లా జడ్జికి బార్ అసోసియేషన్ సభ్యులు విన్నవించారు.



చాగలమర్రిలో జెండాను ఆవిష్కరిస్తున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు



బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్‌లో..



ప్యాపిలిలో..



రుద్రవరంలో..

ఘనంగా మేడే వేడుకలు

- వాడవాడలా రెపరెపలాడిన ఎర్ర జెండా
- పాల్గొన్న కార్మికులు, ట్రేడ్ యూనియన్ల నాయకులు

చాగలమర్రి/ బేతంచెర్ల/ డోన్ టౌన్/ కోవెలకుంట్ల/ రుద్రవరం/ప్యాపిలి/ బనగానపల్లె/ అవుకు/ క్రిష్ణగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వాడవాడల్లో ఎర్రపు జెండాలు రెపరెపలాడాయి. ఈ వేడుకల్లో కార్మికులు , ఆయా ట్రేడ్ యూనియన్ల నాయకులు పాల్గొని జెండాను ఎగరవేశారు. చాగలమర్రిలోని గ్రామ చావిడి వద్ద గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి, హమాలీ యూనియన్ అధ్యక్షుడు గుత్తి నరసింహులు ఎగురవేశారు. బేతంచెర్ల మండలంలోని సిమెంట్‌నగర్‌లో ఏఐటీయూసీ నాయకులు లక్ష్మన్న అధ్యక్షతన ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యచంద్రుడు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, సహాయ కార్యదర్శులు తాలుకా తిరుమలేష్, డి.దస్తగిరి హాజరయ్యారు. నాయకులు ఇమ్మానుయేలు, సామేల్, కాశీం, సెంట్రింగ్ రాజు, కార్మికులు పాల్గొన్నారు. డోన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద, డిపో ఆవరణలో డిపో సెక్రటరీ ఆధ్వర్యంలో ఐవీ రెడ్డి ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. డ్రైవర్ రామిరెడ్డి జెండాను ఆవిష్కరించి మేడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎల్‌హెచ్ గోపాల్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి, కోటేశ్వరరావు, ఏఎస్ కుమార్, భగవాన్, బాబ్జి, సత్యం, వైఎంఎస్ రెడ్డి, రాముడు, శివయ్య, ఐటీఎస్ రెడ్డి, ఇమ్రాన్, డి.బాషా పాల్గొన్నారు. కోవెలకుంట్లలోని అంబేడ్కర్ సర్కిల్‌లో భగత్‌సింగ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులతో ఆయూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కమ్మగిరి రాముడు, చక్రవర్తి, కరీంబాషా జెండాను ఎగరవేశారు. రాయలసీమ కళావేదిక అప్పపోగు వెంకటసుబ్బయ్య, అరుణోదయ సాంస్కృతికసమాఖ్య తరపున కాశీపురం రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం తరపున రెడ్డిపల్లె ఓబయ్య, అఖిలభారత కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం మహేశ్వరరావు, రాముడు, బుజ్జి పాల్గొన్నారు. రుద్రవరంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి రామచంద్రుడు జెండాను ఎగరవేశారు. కె.కొత్తూరు గిరిజనగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. గంగయ్య, ముసలయ్య, దేవరాజ్, తిరుపాలయ్య, రామాంజి, అల్లారయ్య, హనుమంతు పాల్గొన్నారు. ప్యాపిలిలో సీపీఐ, సీపీఎంలు వేర్వేరుగా మేడేను నిర్వహించారు. ఆయా పార్టీలనాయకులు జెండాలను ఆవిష్కరించారు. నాయకులు వెంకటేశ్, చిన్నరహిమాన్ పాల్గొన్నారు. బనగానపల్లెలోని ఆర్టీసీ కార్యాలయ ఆవరణంలో నేషనల్ మజ్దూర్ అసోసిషన్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. నాయకులు శ్రీనివాసులు, ఓబులేసు, రాయుడు పాల్గొన్నారు. సీపీఎంఆధ్వర్యంలో సీపీఎం నాయకుడు సుబ్బయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోవర్కర్సు యూనియన్ నాయకులు మేడే సందర్భంగా జెండాను ఎగురవేసి మేడే వేడుకలు జరుపుకున్నారు. అవుకు బస్టాండ్ సర్కిల్‌లో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు హుసేని, బాలహుసేని, నాగాంజనేయులు ఆధ్వర్యంలో కార్మికులు జెండాను ఎగురవేశారు. ఆటో, భవన నిర్మాణ కార్మికులు వెంకటేశ్వర్లు, శ్రీను, మధు, నాగేంద్రనాయక్, పుల్లయ్య వెంకటరమణ పాల్గొన్నారు. క్రిష్ణగిరి మండలంలోని అమకతాడు టోల్‌ప్లాజా వద్ద సీఐటీయూ జెండా ఎగురవేశారు. సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి టి.శివరాం, శ్రీనివాసులు, టోల్ ప్లాజా ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



కోవెలకుంట్లలో..

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండ

- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు ఇవ్వాలి
- రాష్ట్ర రోడ్ల, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రోడ్ల, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో అకాల వర్షాలు, గాలి వానలతో చేతికొచ్చిన పంట నీటమునగడం, వరి, మొక్కజొన్న పంటలు నేలవాలటడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలోని అధికారులకు, వ్యవసాయాధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. అకాల వవర్షాల కారణంగా జరిగిన ఆస్తి, పంట నష్టంపై అధికారులతో మంత్రి చర్చించారు. అవుకు మండలంలో 500 ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగి నష్టపోయినట్లు వ్యవసాయాధికారులు మంత్రికి వివరించారు. వ్యవసాయంతో పాటు హార్టికల్చర్‌కు సంబంధించిన పంట నష్టంపై కూడా అంచనా వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అకాల వర్షం, గాలివానతో నియోజకవర్గం వ్యాప్తంగా విద్యుత్ తీగలు తెగిపడడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో ఏర్పడ్డ విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయాలని మంత్రి విద్యుత్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, విద్యుత్ అధికారులు పర్యటించి నివేదికలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
- మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యే



పింఛన్లు అందజేస్తున్న శబరి, కోట్ల సుజాతమ్మ

డోన్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. గురువారం పట్టణంలోని తారకరామనగర్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారులకు నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీ శబరి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మతో కలిసి నిర్వహించారు. ఆ ప్రాంతంలోని సమస్యలను ప్రజలు అడిగి తెలుసుకున్నారు.

ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవతో పట్టణలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్‌వాటర్ ప్లాంటును మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ఎంపీ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఆంధ్ర ఆర్గానిక్స్ లిమిటెడ్ నిర్వహణలో నడిచే ఈ వాటర్ ప్లాంటును ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి వలసల రామకృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ కోట్రికే హరికిషణ్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నీలం భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, తారకరామ్‌నగర్‌కు చెందిన నాయకులు లారీల బాషా, ధర్మవరం ఈశ్వరయ్య, టైలర్ ఖాజా, బీజేపీ నాయకులు సందు వెంకటరమణ, జనసేన నాయకులు గడ్డం బ్రహ్మం, కమిషనర్ ప్రసాద్‌గౌడు పాల్గొన్నారు.

పండుగలా ఎన్టీఆర్ భరోసా..

రుద్రవరం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పండుగలా కొనసాగిందని ఎంపీడీవో భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కోటకొండ, చిన్నకంబలూరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఆమె పరిశీలించారు. మొత్తం 6151 పింఛన్లు ఉండగా 5292 పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

92 శాతం పింఛన్లు..

చాగలమర్రి: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. 6,173 మందికి గాను రూ.2.63 కోట్లు పింఛన్ల సొమ్ము మంజూరైందన్నారు.

పాతపాడులో..

బనగానపల్లె: మండలంలోని పాతపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మండల స్పెషల్ అధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీవో రమణ పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణానికి బీసీ దంపతుల వితరణ

4న వేంకటేశ్వరస్వామి ఆలయ భూమి పూజ



భూమిపత్రాలు ఈవో బ్రహ్మానందరెడ్డికి అందిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భానుముక్కలలోని వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50లక్షల విలువ చేసే ఆరు సెంట్ల స్థలాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు వితరణ చేశారు. గురువారం ఆభూమికి సంబంధించిన డాక్యుమెంట్ పత్రాలను గ్రూప్ టెంపుల్ ఈవో బ్రహ్మానందారెడ్డికి మంత్రి బీసీ ఇందిరమ్మ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంవద్ద నిర్వహించిన సమావేశంలో బీసీ ఇందిరమ్మ మాట్లాడారు. భానుముక్కలలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయం కోసం ఆరు సెంట్లు స్థలం రూ.50లక్షలతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కొనుగోలుచేసి ఈవోకు డాక్యుమెంట్లను అందించినట్లు తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం 2014లో ఎమ్మెల్యేగా ఉన్న బీసీ జనార్దన్‌రెడ్డి ర.16లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశారన్నారు. నేడు వడ్డీతో కలసి ప్రస్తుతం రూ.,31లక్షలు అయిందన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవ తీసుకొని దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలసి వెంకటేశ్వరస్వామి గుడి నిర్మాణం కొరకు సహకరించాలని కోరగా రూ.రూ.3.10కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈనెల 4వతేదీ ఆదివారం భూమిపూజ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేయనున్నట్లు వెల్లడించారు. టీడీపీ జిల్లా వాణి జ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, గాథంశెట్టి వేణుగోపాల్, శ్రీరామ వెంకటసుబ్రమ ణ్యం, బండారు ప్రకాశ్, కాసుల జంగంశెట్టి, డాన్ శ్రీను, గుండా రవికుమార్, సాయిరాం, భరతుడు, ఉపాధ్యాయుడు నాగ రాజు, న్యాయవాది నాగేంద్రారెడ్డి, పీఎస్ఎస్‌నారాయణ, బచ్చుభాస్కర్, బత్తుల బాస్కర్‌రెడ్డి, తలారి తిరుమలయ్య, కోడి నాగేశ్ పాల్గొన్నారు.



కొత్తపేటలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

తాగునీటి ఎద్దడి తీర్చాలి

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన కొత్తపేట కాలనీవాసులు

డోన్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్తపేట కాలనీలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని తీర్చాలని ఆ కాలనీవాసులు మొర పెట్టుకుంటున్నారు. గురువారం మాజీ కౌన్సిలర్ సుజాత, సౌజన్య, మాణిక్యమ్మ, పెద్దక్కతో పాటు మరి కొంత మంది కాలనీవాసులు బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి తాగునీరు రావడం లేదని, అవస్థలు పడుతున్నామన్నారు. తాగునీరు సరఫరాను పాత పద్ధతిలోనే అందిస్తే మాకు పూర్తిగా తాగునీరు అందుతుందన్నారు. జీడీపీ పైపులైన్‌కు అడ్డుగా డమ్మీ వేయడంతో పాత కొళాయిలకు నీరు రావడం లేదన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ కాలనీకి పాత పద్ధతిలోనే యథావిధిగా కొళాయిలకు నీరు వదలాలని విజ్ఞప్తి చేశారు.

8న చెన్నకేశవ, సంజీవరాయ బ్రహ్మోత్సవాలు

చాగలమర్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల బ్రహ్మోత్సవాలను ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి తెలిపారు.గురువారం ఆలయంలో బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. 8న ధ్వజారోహణం, 9న కల్యాణోత్సవం, 10న సింహవానం, 11న హనుమంతోత్సవం, 12న గరుడోత్సవం, 13న గజ వాహనం, 14న రథోత్సవం, 15న అశ్వవాహనం, 16న వసంతోత్సవం జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గాలివాన బీభత్సం

రుద్రవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ప్రధానరహదారిలో వేప కొమ్మ విరిగిపడింది. నరసాపురం, హరినగరం, రుద్రవరం, నాగులవరంల్లో ధాన్యం, మొక్కజొన్నలు తడిసిపోయాయని రైతులు వాపోయారు.

వ్యక్తి అదృశ్యం

బేతంచెర్ల, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బైటిపేటలో నివాసం ఉంటున్న మాసూంబాషా అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. అతడి భార్య గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తిరుపాలు తెలిపారు.

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి : సుబ్బారెడ్డి



నాయకులతో చర్చిస్తున్నరాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతి పనుల పునః ప్రారంభానికి విచ్చేయుచున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఒంగోలు టీడీపీ కార్యాలయంలో అక్కడి ఎమ్మెల్యే జనార్దన్‌తో కలిసి ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు బయలుదేరే కార్యకర్తలు, అభిమానులకు ఏర్పాటుచేసే బస్సులు, వాహనాలు, కార్లు, భోజన ఏర్పాట్లపై చర్చించారు.

మోదీ సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు

క్రిష్ణగిరి: అమరావతిలో శుక్రవారం జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభకు తెలుగు తమ్ముళ్లు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. శ్ను బస్సులో బయలుదేరి వెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెల్దుర్తి నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరారు.

కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లె రవిప్రకాశ్‌రెడ్డి, కోరుమానుపల్లె ఓబయ్య, నరసింహారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంటేష్, వెంకటరాముడు, రామయ్య, రాఘవ 30 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు ప్రత్యేక బస్సులో అమరావతికి బయలుదేరి వెళ్లారు.

దస్తగిరిస్వామి దర్గాలో భూమా జగత్ ప్రత్యేక ప్రార్థనలు



దస్తగిరిస్వామికి ఫాతెహాలు చేస్తున్న జగత్ విఖ్యాతరెడ్డి

చాగలమర్రి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో దస్తగిరి స్వామి దర్గాలో ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దస్తగిరిస్వామి ఉరుసును వైభవంగా నిర్వహించారు. గ్రామానికి వచ్చిన భూమా జగత్‌కు టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సూర్యనారాయణ, రామసుబ్బయ్య, నరసింహుడు, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం

ఆళ్ళగడ్డ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేశారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

శ్మశాన వాటికకు భూమిని కేటాయించండి

డోన్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హిందూ శ్మశాన వాటికకు ఐదెకరాల భూమిని కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తహసీల్దార్ కె.నాగమణిని కోరారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కే.నాగమణికి మున్సిపల్ చైర్మన్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ హిందూ శ్మశాన వాటికలో సమాధులు నిర్మించడంతో అంత్యక్రియలు చేసుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్ ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న రాజేశ్వరి(55) అనే అనాథ మహిళా శవానికి 'ఆనలుగురు' స్వచ్ఛంద సంస్థ సభ్యులు అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. కొన్ని నెలల క్రితం జమ్మలమడుగు నుంచి వచ్చి బేతంచెర్ల పంచాయతీ బోర్డు పక్క సందులో బాడుగకు ఉండి బజ్జీలు వేసుకుంటూ జీవనం సాగిస్తూ వేదవతితో కలిసి నివాసముంటుంది. రాజేశ్వరి అనారోగ్యంతో మృతిచెందింది. దివ్యాంగురాలైన వేదవతి రాజేశ్వరి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని ఆ న లుగురు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూరు బాషాను విజ్ఞప్తి చేసింది. పోలీసులకు ఈవిషయాన్ని తెలియజేసి సంస్థ సభ్యులు శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.